



నేడు రాఖీ పౌర్ణమి

సోదర ప్రేమకు ప్రతీక రాఖీ 6లో

ఆచారాలు.. వారు మరువరు!

- ఇప్పటికీ సంస్కృతీ సంప్రదాయాల ఆచరణ
- గిరిజన గ్రామాల్లో పండగలు ప్రత్యేకం

నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం



మెళియాపుట్టి మండలం పరశురాంపురంలో కొండపై దేవతలను పూజిస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎన్ని తరాలు మారినా ఆదివాసీలు తమ ఆచారాలను మరువలేదు. వాటిని కాపాడుకుంటూ వస్తున్నారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందిస్తున్నారు. ముఖ్యంగా పండగల్లో తమ ఆచారాల ద్వారా ప్రత్యేకతను చాటుకుంటున్నారు. అలాగే కష్టపడి పండించిన పంటకు సైతం పూజ చేస్తూ.. జీవనం సాగిస్తున్నారు. శనివారం అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం. ఈ సందర్భంగా గిరిజనుల ఆచారాలపై కథనం..

● గిరిజనులు ఏటా మే 14, 15, 16 తేదీల్లో మామిడికాయలు పండుగ జరుపుకుంటారు. తొలిరోజు ఉజ్జిడమ్మను తీసుకువచ్చి.. గ్రామ శివారులో ఉంచి ప్రత్యేక పూజలు చేస్తారు. రెండో రోజు మామిడికాయలు నైవేద్యం పెట్టి.. ఆరగిస్తారు. మూడోరోజు కొండ దేవత ఇంద్రజమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తారు. కొండలపై పండించిన పంటలతో వంటలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. అక్కడే వంటలు చేసి.. బంధువులంతా భోజనాలు చేస్తారు.

● ఆదివాసీ ప్రాంతాల్లో వివాహ ఆచారం కూడా ప్రత్యేకమే. కట్నం లేని వివాహాలు జరుగుతాయి. పూర్వం నుంచీ జన్నివారే పూజార్లుగా వ్యవహరిస్తున్నారు. వివాహాలు, శుభకార్యాలు జన్ని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలోనే నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే గిరిజనులు సొంతంగా తయారు చేసిన వాయిద్య పరికరాలనే వినియోగిస్తారు. థింసా నృత్యం, కోయిడ్యాన్స్‌లతో సందడిగా కార్యక్రమాలు నిర్వహిస్తారు.



● గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. జొన్నలు, సామలు, రాగులు, కంది తదితర పంటలు పండిస్తున్నారు. ప్రభుత్వం గిరిజనుల (మిగతా 6వ పేజీలో..)

గిరిజన గ్రామాలకు రోడ్లు

- చంద్రబాబు సీఎం అయ్యాక ప్రత్యేక దృష్టి
- డోలీ మోతలు లేకుండా ఉండేందుకు..
- గతంలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం



మెళియాపుట్టి మండలం అడ్డివాడ కొండపై ఇటీవల నిర్మించిన రహదారి

మెళియాపుట్టి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. అధికారంలోకి రాగానే తొలుత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వైసీపీ హయాంలో గిరిజన గ్రామాలకు పట్టించుకోక పోవడంతో వారి బతుకులు అధ్వానంగా మారాయి. అత్యవసర పరిస్థితుల్లో డోలీ మోతలే గతి. అయితే కూటమి అధికారంలోకి రాగానే వారి ఆశలు నెరవేరుతున్నాయి.

● వైసీపీ పాలనలో గిరిజనులకు విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు వంటి కనీస వసతులు కరువయ్యాయి. గిరిజన సబ్‌ప్లాన్ నిధులు సైతం కార్పొరేషన్లకు దారి మళ్లించడంతో అభివృద్ధి కుంటుపడింది. గత ప్రభుత్వం జిల్లాకు ఐటీడీఏ కేటాయించకుండానే పునర్విభజన చేపట్టింది. రెండు జిల్లాలకూ ఒకే ఐటీడీఏ కావడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు తొలుత గిరిజనాభివృద్ధిపై దృష్టి సారించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా డోలీమోతలు లేకుండా రహదారి నిర్మాణాలకు ఉపాధిహామీ నిధులను మంజూరు చేశారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 145 గ్రామాల్లో రహదారులకు నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ముందుగా 72 గ్రామాలకు రూ.51.92 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రహదారులు (మిగతా 6వ పేజీలో..)

వరలక్ష్మీ.. కరుణించమ్మా

- భక్తిశ్రద్ధలతో శ్రావణమాస వ్రతాలు



శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. శ్రావణమాసం మూడో శుక్రవారం పురస్కరించుకుని.. జిల్లావాసులు ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన ఆహార పదార్థాలు, పిండి వంటలను వండి నైవేద్యంగా సమర్పించారు. ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు చేశారు. శ్రీకాకుళంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, సంతోషిమాత తదితర ఆలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి.. వరలక్ష్మీ- కరుణించమ్మా అని భక్తులు వేడుకున్నారు.



శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు



చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్ 8లో

స్నేహితుల మధ్య సెల్‌ఫోన్ చిచ్చు

- గొడవ.. పరస్పరం దాడులు.. ఒకరి పరిస్థితి విషమం

బీఎస్ఎన్ఎల్ కేంద్రంలో

అగ్నిప్రమాదం

6లో



కాలిపోయిన వైర్లు, సామగ్రి

ప్లాన్ తప్పుతోంది

- శ్రీకాకుళం నగరంలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- అధికారులు, సిబ్బంది పాత్రపై ఆరోపణలు
- దృష్టి సారించని ఉన్నతాధికారులు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది. ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలు నిర్మాణాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఒకలా అనుమతి పొంది.. నిర్మాణాలు మరోలా చేస్తున్నారు. కొంతమంది అధికారులకు ముడుపులు ఇస్తే చాలు.. అక్రమాలకు అనుగుణంగా ప్లాన్ మారిపోతుందన్న ఆరోపణలున్నాయి. శ్రీకాకుళం నగర పాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడంతో అక్రమార్కులకు కలిసి వస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం 200 చదరపు గజాల స్థలంలో నిర్మించే భవనానికి విధిగా సెట్‌బ్యాక్ వదలాలి. ఇంటికి ముందు, వెనుక భాగాల్లో రెండు మీటర్లు, మిగతా రెండు వైపులా 1.5 మీటర్ల స్థలాన్ని వదలాలి. సెల్లారులోనే పార్కింగ్ స్థలం ఉండాలి. అయితే నిబంధనలను నూటికి 90శాతం మంది పాటించడం లేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నగర పాలక ఉన్నతాధికారితో పాటు కీలక అధికారులు సుమారు రెండు నెలలు ఎలక్షన్ విధుల్లో బిజీబిజీగా గడిపారు. ఇదే అదునుగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ చేయాల్సిన ప్లానింగ్ సెక్రటరీ, చైన్‌మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదనపు ఫ్లోర్‌కు, అనుమతి లేని నిర్మాణాలకు రూ.2 లక్షలు వరకు డిమాండ్ చేస్తున్నారన్న సమాచారం. ముడుపులు ఇస్తే నిర్మాణాలను సజావుగా సాగనిస్తారు. లేదంటే ఏదో ఒక రకంగా కొర్రీపెట్టి ఆపేస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి.

కఠిన చట్టాలు తీసుకొచ్చినా...

కూటమి ప్రభుత్వం టౌన్‌ప్లానింగ్ విషయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చింది. కొత్త విధానం వల్ల పట్టణాల్లో ప్రతి బిల్డింగ్ నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. తప్పు జరిగిందా...?యజమాని, ప్లానర్‌పై ఇద్దరిపైనా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. ఉదాహరణకు 300 స్క్వేర్ మీటర్‌లో భవన నిర్మాణం గతంలో చేసుకుంటే కొంత సడలింపు ఉండేది. మార్టిగేజ్ ఉండడంతో చిన్న చిన్న తేడాలు ఉన్నా పెద్దగా పట్టించుకొనేవారు కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొత్త జీవో (మిగతా 7వ పేజీలో..)



శ్రీకాకుళం న్యూ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్

ఎక్కువ మంది ఆ ధీమాతోనే..

గతంలో టీడీపీ ప్రభుత్వం అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.700కోట్లు ఆదాయం వచ్చేలా చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కచ్చితంగా అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరిస్తుందనే నమ్మకంతో అక్రమ నిర్మాణదారులు ఉన్నారు. ఇటీవల మంత్రి నారాయణ కూడా ప్లాన్లకు మించి అదనపు శ్లాబ్ నిర్మాణాలు చేసిన వాటిని నిబంధనలకు అనుగుణంగా క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇదే అదునుగా శ్రీకాకుళంలో చాలామంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఏడాది కిందట నిర్మించిన వాటిని పునఃపరిశీలించి తర్వాతే క్రమబద్ధీకరిస్తారన్న విషయాన్ని మరచిపోతున్నారు.

పొందూరు ఖాదీకి డిసెంబరులో జీఐ!
- భౌగోళిక గుర్తింపుతోనే బహుళ ప్రచారం
- నేత, వడుకు కార్మికులకు శిక్షణ ఇస్తాం
- కేవీఐసీ డిప్యూటీ సీఈవో (బెంగళూరు) మదన్‌కుమార్‌రెడ్డి

6లో

19న డీ వార్మింగ్ డే
- 4,11,258 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- అసంపూర్తి నిర్మాణాలతో ఈ పరిస్థితి

7లో

సామర్థ్యం పెరిగేనా?
- కొరసవాడ ఎత్తిపోతల పథకం విస్తరణకు ఎదురుచూపులు
- సీతారాంపల్లి, బోరుభద్రలో వెంటాడుతున్న సాగునీటి సమస్య

8లో

భయో మెడికల్!



- ఇష్టారాజ్యంగా వ్యర్థాల నిర్వహణ
- నిబంధనలు పాటించని ఆస్పత్రులు
- ప్రజారోగ్యానికి ముప్పు

శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్ కూడలిలో పేరుమోసిన ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. కానీ వాటిలో బయో కెమికల్ వ్యర్థాల నిర్వహణ అనేది తూతూమంత్రంగా జరుగుతోందన్న విమర్శలున్నాయి. సమీపంలో నాగావళి నదిలో నిత్యం ఈ బయో వ్యర్థాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వాస్తవానికి వీటిని శుద్ధి చేయాలి. లేదంటే భూమిలో లోతుగా పాతాలి. కానీ ఇదెక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు. ఏ వ్యాధుల నియంత్రణకు ఔషధాలుగా వాడుతారో.. అవే బయో వ్యర్థాలుగా మారి ప్రజారోగ్యానికి తీవ్ర భంగం కలిగిస్తున్నాయి.

రణస్థలం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల నిర్వహణలో బయోకెమికల్, మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్రధానమైనది. కానీ కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఈ రెండు అంశాలు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 500 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. శ్రీకాకుళం నగరంలోనే సుమారు 100 ఆస్పత్రులు ఉన్నాయి. మరోవైపు పలాస-కాశీబుగ్గ, నరసన్నపేట, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం వంటిచోట్ల ఎక్కువగా ఉన్నాయి. అయితే రోగులకు వైద్యసేవలు అందించడం ఎంత ముఖ్యమో.. వినియోగించే ఔషధాలు, మందులు, వాడిన సామగ్రిని సంరక్షిస్తూ..వ్యర్థాల నిర్వహణ అంతే అవసరం. కానీ జిల్లాలో చాలా ఆస్పత్రుల్లో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. కొన్ని ఆస్పత్రులు మునిసిపల్, పంచాయతీ పారిశుధ్య కార్మికులతో ఒప్పందం చేసుకొని వారికి కొంతమొత్తం అందించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. డంపింగ్ యార్డులకు వెళ్తున్న బయో మెడికల్ వ్యర్థాలతో ప్రజారోగ్యానికి తీరని భంగం కలుగుతోంది. బయోమెడికల్ వ్యర్థాల్లో చాలారకమైన బ్యాక్టీరియా, వైరస్, రోగ కారకాలు వ్యాపించి.. చాలామంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బయో మెడికల్ వ్యర్థాల కారణంగా గాలి, నీరు, నేల సైతం కలుషితం అవుతున్నాయి.

● అంతటా జీవ వైద్య వ్యర్థాలు..

సాధారణంగా వ్యాధి నిర్ధారణ, చికిత్సలో దూది, సూది, సిరంజీ వంటివి ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఒకసారి వాడిన తరువాత ఇవి వ్యర్థాల జాబితాలో చేరుతాయి. అయితే వైద్య ఆరోగ్య పరిభాషలో వీటిని జీవ వైద్య వ్యర్థాలుగా పరిగణిస్తారు. వీటి నిర్వహణ సరిగ్గా లేకపోతే ప్రజారోగ్యానికి పెను ప్రమాదమే. వాస్తవానికి వీటిని శాస్త్రీయ విధానాల్లో వర్గీకరించాలి. సురక్షితంగా తరలించాలి. తరువాత శుద్ధి చేయాలి. అలా శుద్ధి చేయడానికి వీలులేని వ్యర్థాలను భూమి లోపల పాతాలి. కానీ ఈ ప్రక్రియ ఏదీ జరగడం లేదు. చాలా ఆస్పత్రుల్లో వీటిని భద్రపరిచేందుకు గదులు లేవు. ప్రత్యేక విభాగాలు లేవు. దీంతో సూదులు, సిరంజీలు, మాస్కులు, దూది, చేతి తొడుగులు, (మిగతా 7వ పేజీలో..)

ఆదిత్యాలయ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

- పారిశుధ్యం సర్వే పేరిట చర్యలు



ఆదిత్యాలయం

అరసవల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులను ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. ఆలయంలో సేవలపై భక్తుల నుంచి అభిప్రాయాలను అధికారులు సేకరిస్తున్నారు. జూలై నెలకు సంబంధించిన సర్వేలో పారిశుధ్య నిర్వహణలో రెండు శాతం వెనుకబడడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. ఆ విభాగాన్ని పర్యవేక్షిస్తున్న ఉద్యోగిపై తక్షణ చర్యలకు ఆదేశించారు. ఈ క్రమంలో ఆలయ ఈవో ప్రసాద్.. సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే తీవ్రమైన సిబ్బంది కొరత వేధిస్తోంది. నలుగురు మాత్రమే పర్మినెంట్ సిబ్బంది ఉన్నారు. ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. 'కలెక్టర్ ఆదేశాల మేరకు సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేశాం. కొన్ని విభాగాలలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రెగ్యులర్ సిబ్బంది కూడా నలుగురు మాత్రమే ఉన్నారు. నిజానికి డీసీ స్థాయి ఆలయానికి ఇద్దరు సూపరింటెండెంట్లు, నలుగురు సీనియర్ అసిస్టెంట్లు, నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బంది ఉండాలి. కానీ కార్యాలయ విధులకు సంబంధించి నలుగురే రెగ్యులర్ సిబ్బంది ఉండడంతో వారితోనే అన్ని పనులు చేయించాల్సి వస్తోంది. ఇప్పటికే సిబ్బంది కోసం అడిగాం. ఔట్‌సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను నియమించేందుకు టెండర్లు ఆహ్వానించాం. భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

- అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు
- కిక్కిరిసిన ఆలయాలు

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మూడో శుక్రవారం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలతో ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది మహిళలు ఆలయాలకు వెళ్లి దీపాలు వెలిగించి అమ్మవార్లను దర్శించుకున్నారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు. నగరంలోని డీసీసీబీ కాలనీ భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని 108 పట్టు చీరలు, 1008 గాజులతో అలంకరించారు. సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత, చిన్నబజారు కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారిని వందలాది మంది మహిళలు దర్శించుకుని వ్రతాలు ఆచరించారు. బొందిలీపురంలో ఉన్న తుల్జాభవానీ ఆలయంలో అర్చకుడు సింగ్ అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.


నరసన్నపేట: గీతా మందిరంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


శ్రీకాకుళం కల్చరల్: సంతోషిమాత దర్శనానికి క్యూలైన్‌లో భక్తులు


శ్రీకాకుళం కల్చరల్: ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత


సోంపేట రూరల్: తాళభద్రలో గాజులతో అమ్మవారి అలంకరణ


పోలాకి: దీర్ఘాశిలో దుర్గమకు గాజులతో అలంకరణ


ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి ఆలయంలో లలితా పారాయణం చేస్తున్న మహిళలు


మందస: సత్యసాయి బృందావన్‌లో సామూహిక కుంకుమ పూజలు


కొత్తూరు: వరలక్ష్మివ్రత పూజలో పాల్గొన్న మహిళలు


పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


హిరమండలం: బ్యారేజీ సెంటర్ వద్ద గల సంతోషిమాత ఆలయంలో భజన కార్యక్రమం


కంచిలి: కర్తలి గ్రామంలో భక్తి సంగీతాలాపన చేస్తున్న కళాకారులు


గార: దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


ఇచ్ఛాపురం: మహాలక్ష్మీ దేవికి 1008 పూలతో అలంకరణ

ఆచారాలు.. వారు మరువరు!

(ఐదో పేజీ తరువాయి)

ఆదాయం పెంచేలా.. జీడి, మామిడి, పైనాపిల్, పసుపుతోపాటు అంతర పంటల సాగుపై అవగాహన కల్పిస్తోంది. గిరిజనులు పండించి ప్రతి పంటకూ పూజలు చేసిన తర్వాతే కోతలు కోస్తారు. పంటకు పూజిస్తే దిగుబడి పెరుగుతుందని వారి నమ్మకం.

కొండదేవతే మాకు రక్షణ..

మేము కొండల్లో ఉంటున్నాం. మాకు కొండదేవతే రక్షణ. అందుకే ఏటా కొండదేవతలకు పూజలు చేస్తున్నాం. మాకు మామిడికాయల పండుగ ప్రత్యేకం.

-పోలమ్మ, కేరాసింగి, మెళియాపుట్టి

పాఠ్యాంశంగా తీసుకురావాలి..



గిరిజన సంప్రదాయలు, సంస్కృతిపై పాఠ్యాంశంగా తీసుకురావాలి. గిరిజన సాంప్రదాయలు కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం సైతం గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అదృష్టంగా భావించాలి.

-బైరిశింగి ధరణి, గిరిజన సంఘం నాయకురాలు

గిరిజన గ్రామాలకు రోడ్లు

(ఐదో పేజీ తరువాయి)

నిర్మిస్తుండడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గిరిజన విద్యను గాడిలో పెట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏను ఏర్పాటు చేయనున్నట్టు అసెంబ్లీలో గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఇటీవల ప్రకటించారు.

సంతోషంగా ఉంది..



కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సీఎం, డిప్యూటీ సీఎం గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం సంతోషంగా ఉంది. రహదారి పనులు చేపడుతుండడంతో ఇబ్బందులు తప్పాయి.

-లక్ష్మీపురం కిరణ్‌కూమార్, హిరాపురం

గతంలో వెనుకబాటే..



వైసీపీ ప్రభుత్వ పాలనలో గిరిజనాభివృద్ధి వెనుకబడింది. గిరిజన సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించడం వల్ల గత ఐదేళ్లు వెనుకబాటు కనిపించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ఆనందంగా ఉంది.

-లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ, మెళియాపుట్టి

ప్రతిపాదనలు రూపొందిస్తాం..



కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పీఎంజన్ ద్వారా గిరిజనులుకు ఏమి కావాలో గ్రామసభలు పెట్టి దరఖాస్తులు స్వీకరించింది. ప్రతి గిరిజన గ్రామానికి మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందిస్తాం.

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి



బియ్యపు గింజంత సైజ్‌లో..

- ఆకట్టుకుంటున్న బంగారపు రాఖీ

కాశీబుగ్గ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన కొత్తపల్లి రమేష్ ఆచారి రక్షాబంధన్ సందర్భంగా శుక్రవారం బియ్యపు గింజంత సైజులో సూక్ష్మ బంగారు రాఖీని తయారు చేశారు. ఈ బంగారు రాఖీకోసం పది మిల్లీ గ్రాముల బంగారాన్ని ఉపయోగించినట్టు రమేష్ తెలిపారు. దీని తయారీకి సుమారు మూడు గంటలపాటు సమయం పట్టిందని, పలుచటి బంగారపు రేకుపైన ఎటువంటి అతుకులు లేకుండా తయారు చేసినట్టు చెప్పారు.

పొందూరు ఖాదీకి డిసెంబరులో జీఐ!

- భౌగోళిక గుర్తింపుతోనే బహుళ ప్రచారం
- నేత, వడుకు కార్మికులకు శిక్షణ ఇస్తాం
- కేవీఐసీ డిప్యూటీ సీఈవో (బెంగళూరు) మదన్‌కుమార్‌రెడ్డి

పొందూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు సన్నఖాదీకి భౌగోళిక గుర్తింపు (జీఐ) ద్వారానే బహుళ ప్రాచుర్యం లభిస్తుందని కేవీఐసీ సౌత్‌జోన్ (ఖాదీ విలేజి ఇండస్ట్రీస్ కమిషన్, బెంగళూరు) డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏఎఫ్‌కేకే సంఘాన్ని శుక్రవారం సందర్శించారు. మదన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పొందూరు సన్నఖాదీ కార్మికుల కష్టానికి త్వరలోనే భౌగోళిక గుర్తింపు (జీఐ) ద్వారా ఫలితం లభిస్తుందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబరులో జీఐ వచ్చే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా దేశంలో ఖాదీపరిశ్రమ అభివృద్ధికి గతంలో రూ.10 వేల కోట్లతో ఉన్నతాధికారులు పథకాన్ని పథకాన్ని రూపొందించారని, అందులో పొందూరు ఖాదీకి ప్రత్యేక కేటాయింపులు ఉన్నాయని అన్నారు. ఈ పథకం అమల్లోకి వస్తే పొందూరు ఖాదీ దశ, దిశ మారుతుందన్నారు. అంతరించిపోతున్న ఖాదీని కాపాడుకోవాలంటే నేత, వడుకు కార్మికులను ఆకట్టుకోవాలని, దీనికోసం వారికి ఆదాయాన్ని చూపించాల్సి ఉంటుందని చెప్పారు. దీనికోసం కేవీఐసీ పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంతో కలిసి నేత, వడుకు కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఖాదీ సంఘాలకు రావాల్సిన ఎన్‌ఎండీఏలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పొందూరు సన్నఖాదీ వడుకు, నేత ప్రక్రియలను ఆయన పరిశీలించారు. సాంప్రదాయ సన్నఖాదీ వస్త్రాలను తిరుమలలో విక్రయాల కోసం దుకాణం ఏర్పాటుకు టీటీడీ చైర్మన్, ఈవోను సంప్రదించినట్టు చెప్పారు. సన్నఖాదీ వస్త్రాలకు ముడిసరుకైన కొండ, ఎర్రపత్తి కొనుగోలు, పంట వివరాలను సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుంటుకు కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణలను అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు సౌత్‌జోన్ కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ అధికారులు ఉన్నారు.


కార్మికులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో


వడుకు ప్రక్రియలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో


కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో వైద్యులు

బంగారు కుటుంబాలకు అండగా ఉంటాం

- కలెక్టర్‌ను కలిసిన 85 మంది వైద్యులు
- 2580 కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలుస్తామంటూ హామీ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తామని వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వైద్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని 2,580 బంగారు కుటుంబాలకు తాము మార్గదర్శులుగా నిలుస్తామని వారు పేర్కొన్నారు. అలాగే గైనకాలజీ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్ అందిస్తామని, శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ చేస్తామని, రక్తహీనత నివారణకు ప్రతీవారం ఒక హాస్టల్‌కు వెళ్లి సేవలందిస్తామన్నారు. శ్రీకాకుళం నగరంలోని 48 సచివాలయాల్లో వృద్ధాప్యంలో వచ్చే సాధారణ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరంగా సహాయ సహకారాలు అందిస్తామని ఫిజీషియన్స్ అసోసియేషన్ సభ్యులు ప్రకటించింది. వృద్ధాశ్రమాల్లో ఉచిత కంటి పరీక్షల చేసి కళ్లజోడు పంపిణీ చేస్తామని డా.సత్యస్వరూప్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుల సామాజిక బాధ్యతను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కల్యాణబాబు, వైద్యులు సనపల నర్సింహమూర్తి, అరవింద్, మనోజ్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోదర ప్రేమకు ప్రతీక రాఖీ

- నేడు రాఖీ పౌర్ణమి

శ్రీకాకుళం కల్చరల్/నరసన్నపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సృష్టిలో అత్యంత మధురమైన బంధం తోబుట్టువులది. అన్నాచెల్లెలు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీకగా నిలుస్తుంది రాఖీ పండుగ. సోదరికి తోడుంటానని సోదరుడు భరోసా ఇచ్చేదిగా రక్షాబంధన్‌ను చెప్పుకుంటారు. నీకు నేను రక్ష.. నాకు నువ్వు రక్ష.. సమాజం మనందరికీ రక్ష.. అనే భావాల ప్రతీక రక్షాబంధనం. ఆపదలో రక్షణగా.. ఆలోచనలో వెన్నుదన్నుగా.. తోడుండాలని తోబుట్టువులు నిండు మనసుతో ఏటా శ్రావణి పౌర్ణమి రోజున అన్నయ్యలు లేదా తమ్ముళ్లకు రాఖీలు కట్టడం సంప్రదాయంగా వస్తోంది. ఇలా రాఖీ కట్టినందుకు సోదరికి సోదరుడు నగదు రూపంలోనో.. ఇతరత్రానో కానుకలు ఇవ్వడమూ ఆనవాయితీగా వస్తోంది.

రాఖీల సందడి..

జిల్లా అంతటా మార్కెట్లో వివిధ రకాల రాఖీలు అమ్ముడవుతున్నాయి. రూ.పది మొదలుకుని రూ.300 వరకు వీటి ధరలు పలుకుతున్నాయి. సిల్వర్ కోటింగ్ రాఖీలు రూ.150 నుంచి లభ్యం అవుతుండగా.. వెండితో తయారు చేసినవి బరువును బట్టి రూ.600 నుంచి రూ.1000 వరకు ఉన్నాయి. జిల్లాలో ఏటా రూ.కోటి మేర రాఖీలు అమ్ముడవుతాయని ఓ అంచనా. కేవలం సొంత అన్న.. తమ్ముడికే కాకుండా విద్యార్థినులు తాము చదువుకున్న ప్రాంతంలో అన్నా అని పిలిచే ప్రతిఒక్కరికీ రాఖీలు కడుతున్నారు.

కొరియర్ కేంద్రాలకు డిమాండ్

ఉద్యోగం, ఉపాధి, వివాహం, ఇతరత్రా అవసరాల మీద ఇతర ప్రాంతాల్లో ఉంటున్న అన్నయ్యలు, తమ్ముళ్లకు పోస్టల్ లేదా కొరియర్ ద్వారా రాఖీలు పంపించడం ఆనవాయితీగా వస్తోంది. వారు ఉన్న ప్రాంతాన్ని బట్టి రాఖీలు ప్యాక్ చేసి పంపించేందుకు కొరియర్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా నిర్వాహకులు ఒక్కో కవర్‌కు రూ.50 నుంచి రూ.100వరకు వసూలు చేస్తున్నారు.



పర్యావరణానికి రాఖీలు..

పర్యావరణం పరిరక్షించేలా రకరకాల విత్తనాలను ఒక రాఖీలు తయారు చేస్తున్నారు. విత్తనాలను కాగితంతో కప్పి ఉంచి, మీదన కాగితపు పూలతో అతికిస్తున్నారు. ఇవి ఎక్కడైనా పడిపోయినా, పెరడు.. తోటల్లో పడవేసినా ఇందులో ఉన్న విత్తనాలు మొలకెత్తుతాయి. వీటినే పర్యావరణ రాఖీలుగా పిలుస్తున్నారు. మరికొందరు జెండాలతో రాఖీలు తయారు చేస్తున్నారు. రాఖీలు కూడా 20 రూపాయల నుంచి 1000 పైనే పలుకుతున్నాయి. రాఖీల్లో చిన్న చిన్న మెరుపులు లైట్లు పెట్టి పిల్లలు ఆకర్షించేలా తయారు చేస్తున్నారు. ఈ నెల 8న ఉదయం 5.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు రాఖీలు కట్టడానికి మంచి ముహూర్తం ఉందని పండితులు చెబుతున్నారు.

40 ఏళ్లుగా.. అన్నయ్యకు రాఖీ

వాళ్లు ముగ్గురు అక్కాచెల్లెళ్లు. వారి ఒక అన్నయ్య. వీరు 40 సంవత్సరాలుగా అన్నయ్యకు క్రమం తప్పకుండా రాఖీ కడుతూ వస్తున్నారు. వీరే సంతబొమ్మాళి మండలం కోటపాడుకొత్తూరుకు చెందిన పాపయ్య, లక్ష్మీబాయి దంపతుల పిల్లలు. వీరికి పెద్ద కుమారుడు లక్ష్మణబాబు, రెండో కుమార్తె లీలరాణి, మూడో కుమార్తె లత, నాలుగో కుమార్తె జ్యోతి. లక్ష్మణబాబు బీఎస్ఎన్ఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన సోదరిలు ఉపాధ్యాయులు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. అయితే రాఖీ పండుగనాడు తన సోదరుడు ఎక్కడ ఉన్నా అక్కడికి చేరుకుని రాఖీ కడతారు. తమ అన్నయ్య అంటే ఎనలేని ప్రేమ అని అంటారు.

19న డీ వార్మింగ్ డే

- 4,11,258 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత



అరసవల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం.. పాఠశాల ఆరోగ్య పథకంలో భాగంగా జిల్లాలో ఆగస్టు 12న డీ-వార్మింగ్ డే, ఆగస్టు 20న మ్యాప్ అప్ డే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 4,11,258 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయనున్నామన్నారు. జిల్లాలో 3,296 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు అలాగే 3,358 అంగన్వాడీల్లోని 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఈ మాత్రలు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలాల వారీగా పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీఓ, సీఆర్పీ పర్యవేక్షణలో మాత్రల పంపిణీ చేపడుతున్నామన్నారు. ప్రతీ పాఠశాలకు ఒక వైద్య సిబ్బందిని పర్యవేక్షకులుగా నియమించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు వేయాలన్నారు. సమావేశంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ కేంద్రంలో అగ్నిప్రమాదం

మందస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మందస మెయిన్‌రోడ్డు బోయివీధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్ ఎక్ఛేంజిలో శుక్రవారం వేకువజామున అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కేంద్రం నుంచి దట్టమైన పొగలు రావడాన్ని స్థానికులు గమనించి వెంటనే అధికారులకు తెలియజేశారు. మంటలు మరింత వ్యాపించకుండా అదుపు చేశారు. అప్పటికే టెలిఫోన్ కేంద్రంలో విలువైన ట్రాన్స్‌మిషన్‌లో కొన్ని పరికరాలు, యంత్రాలు, వైర్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రూ.3లక్షల విలువైన పరికరాలు, యంత్రాలు పాడైనట్లు అధికారుల అంచనా. ఈ కారణంగా మొబైల్ టవర్, ఫైబర్ సేవలకు అంతరాయం కలిగింది. డీఈఈ రాజేంద్ర, జేటీవో పి.మురళి, ఎస్‌డీఈ బి.నేతాజీ వచ్చి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. బీఎస్ఎన్ఎల్ సేవలు వీలైనంత త్వరగా అందుబాటులోకి తెస్తామని చెబుతున్నారు.


పరిశీలిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం: శంకర్



వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఎ కాలనీలోని కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వారి సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీకాకుళం అర్బన్, రూరల్, గార మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తంచేస్తున్న హమాలీలు

ఎచ్చెర్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని బాట్లింగ్ యూనిట్‌ను విభజించ వద్దని కోరుతూ హమాలీలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు మాట్లాడుతూ.. ఎచ్చెర్లలో బాట్లింగ్ యూనిట్ ఏర్పాటుకు భూములిచ్చిన దళితులకు అన్యాయం చేయొద్దన్నారు. టెక్కలిలో డిపో ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కు తీసుకుని ఇక్కడి హమాలీలకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో హమాలీల యూనియన్ నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఎన్.సురేష్, నిడిగింట్ల రమణ, బోనెల రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు

అరసవల్లి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించనున్న నేపథ్యంలో జిల్లా పరిధిలో దినసరి వేతనంపై ఆన్ కాల్ డ్రైవర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అర్హత ఉన్న వారి నుంచి దరఖాస్తులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి(ఇన్‌చార్జి) హెచ్.అమరసింహుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు పలాస, టెక్కలి, శ్రీకాకుళం 1, 2 డిపోల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుం దన్నారు. డ్రైవర్ పోస్టులకు 55 ఏళ్ల లోపు వయసు, హెవీ వెహికల్ లైసెన్స్, 18 నెలల అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వారి దగ్గరలోని ఆర్టీసీ డిపోల్లో సంప్రదిం చాలని కోరారు. శ్రామిక్, అసిస్టెంట్ మెకానిక్‌లుగా పనిచేసేందుకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా సంప్రదించాలన్నారు. వీరు ఐటీఐ(డీజిల్ మెకానిక్) ఉత్తీర్ణత సాధించి, అప్రెంటిషిప్ చేసి ఉండాలన్నారు.

'ప్లాన్' తప్పుతోంది

(ఐదో పేజీ తరువాయి)

ప్రకారం నిబంధనలు అతిక్రమించారని గుర్తిస్తే కేసుల్లో ఇరుక్కోవాల్సిందే. ప్లానర్‌కు ఐదేళ్ల వరకు లైసెన్స్ రద్దు అవుతుంది. స్థల యజమానిపై కేసు నమోదు చేస్తారు. సడలింపు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం కష్టమంటున్నారు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ ఇచ్చేవారు. ఇప్పుడు ఎల్‌టీపీలదే కావడంతో భయ పడాల్సి వస్తోంది. ఎకరం లోపు అపార్ట్‌మెంట్ విషయంలోనూ ఇదే పరిస్థితి. జీ ప్లస్-5కు గతంలో టౌన్‌ప్లానింగ్ ఆర్డీ పరిశీలించి ఆమోదం తెలిపినా ఏమైనా అభ్యంతరాలుంటే మార్పులు చేసి ప్లాన్ ఇచ్చే వారు. ఇప్పుడది ఉండదు. అంతా ఎల్‌టీ పీలదే బాధ్యత. స్థలానికి సంబంధించి ఎవరైనా కేసులు ఉన్నట్టు ఫిర్యాదు చేస్తే సంబంధిత యజమానిపై, ప్లానర్‌పై కేసులు నమోదు చేస్తారు. అయినా సరే అ క్రమాలకు చెక్ పడకపోవడం గమనార్హం.

దృష్టి సారించాం



శ్రీకాకుళంలో అక్రమ నిర్మాణాల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారిం చాం. టౌన్ ప్లానింగ్ అధికారులను సైతం అప్రమత్తం చేశాం. ఎటువంటి అక్రమాలు జరగకుండా చూస్తాం. అవసరమైతే కేసులు నమోదు చేస్తాం. అపరాధ రుసుంను వసూలు చేస్తాం. ఈ విషయంలో అవసరమైతే రెవెన్యూ అధికారుల సహకారం తీసుకుంటాం.

- పీవీవీడీ ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

దళితులపై కపట ప్రేమను మానుకోవాలి

ఆమదాలవలస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దళితులపై వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కపట ప్రేమను మానుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సభ్యుడు తోట రాము అన్నారు. శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఎస్సీ సంఘ నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. మునగవలస రేషన్ డిపో డీలర్ మార్పు విషయంలో లేనిపోని నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో శారదాదేవి డీలర్‌గా ఉండేవారని, ఆమె మృతి తర్వాత 2014 నుంచి 2018 వరకు ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌కు చెందిన సురాన స్వాతిని డీలర్‌గా నియమించారన్నారు. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక స్వాతిని తొలగించి ధనలక్ష్మిని నియమించారన్నారు. అక్రమంగా నియమించబడిన ధనలక్ష్మిని కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తొలగించి ఎస్‌హెచ్‌జీకి చెందిన సూర్యకుమారిని డీలర్‌గా నియమించారన్నారు. ధనలక్ష్మి ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిందని, ఈ అంశం ప్రస్తుతం కోర్టులో ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గొల్లపల్లి సింహాద్రి, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బొత్స అప్పన్న, పెంకి రాజశేఖర్, నవిరి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చిత్తడిగా మారిన రోడ్డు

సోంపేట రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తోటవూరు గ్రామంలోకి వెళ్లాలంటేనే గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం వర్షం కురిసినా రోడ్డంతా బురదమయంగా మారి కనీసం నడిచేందుకు కూడా అవకాశం లేకుండా పోతోంది. ఐదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. వర్షం పడితే నిత్యం నరకాన్ని అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శుక్రవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి రహదారి దారుణంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న రహదారి

నిరుపయోగంగా రైతు సేవా కేంద్రాలు

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం
- అసంపూర్తి నిర్మాణాలతో ఈ పరిస్థితి
- వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం



అసంపూర్తిగా ఉన్న టీడీవలస రైతు సేవా కేంద్రం (ఇన్‌సెట్‌లో) లోపల మందుసీసాలు, పేకాట కార్డులు

జి.సిగడాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో రైతులకు సేవలందించేందుకు గాను రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు)ను ఏర్పాటు చేసింది. అయితే అనాలోచిత నిర్ణయాలు, గ్రామాలకు దూరంగా భవనాల నిర్మాణం చేపట్టింది. అవికూడా పూర్తి చేయక పోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. రైతులకు సేవలందించాల్సిన ఈ భవనాలు పేకాట, మద్యం సేవించేందుకు వినియోగిస్తుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని టీడీవలస, నడిమివలస గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల నిర్మాణం ప్రారంభించినా నేటికీ పూర్తి చేయకపోవడంతో దిష్టిబొమ్మల్లా దర్శన మిస్తున్నాయి. ఈ కేంద్ర భవనాలకు ఎటువంటి తలుపులు బిగించకపోవడంతో పేకాట కార్డులు, తాగి వదిలేసిన మద్యం సీసాలతో నిండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ భవనాల నిర్మాణం పూర్తిచేసి ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు మండల సమావేశం

పొందూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కిల్లి ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి

జి.సిగడాం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత ఫలితాల వైపు అడుగులు వేయాలని సత్యసాయి సేవా సమితి విద్యా విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.జనార్దనరావు అన్నారు. శుక్రవారం బీసీ బాలుర వసతి గృహంలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని హాస్టల్‌కు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి లోలుగు నూకరాజు, ఉపాధ్యాయులు వై.ఆదినారాయణ, ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం

కవిటి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కుసుంపురం గ్రామానికి చెందిన కె.యశ్వంత్ (2) బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని తెలుసుకొని గ్రామానికి చెందిన యువకులు సాయమందించారు. శుక్రవారం గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు రూ.15,500 చిన్నారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సభ్యులు సురేష్ కుమార్, గున్నయ్య, ఆశిష్, రవి, గోపాల్ పాల్గొన్నారు.

కళాకారులకు..

ఇచ్ఛాపురం/కవిటి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గం కవిటి మండలం గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు దేవాడా ఎర్రయ్య, బూర్జుపాడు గ్రామానికి చెందిన డోలక్ కళాకారుడు శేషగిరి ఆచారి అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.10,500 నగదును అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తిప్పన దాలయ్యరెడ్డి, ధనుంజయ రెడ్డి, రంగాల జానికిరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'భయో' మెడికల్!

(ఐదో పేజీ తరువాయి)

బ్లడ్ బ్యాగులు, రక్తపరీక్ష పరికరాలు, కణజాలం, గ్లూకోజ్ బాటిళ్లు, వైర్లు, పీపీఈ కిట్లు వంటి వాటిని కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పడేస్తున్నాయి. జిల్లాలో చాలా ఆస్పత్రుల వద్ద పరిశీలిస్తే వెనుక భాగంలో, రోడ్లపై పారబోస్తు న్నారు. నదులు, చెరువులు, నిర్జన ప్రదేశాల్లో ఈ బయో మెడికల్ వ్యర్థాలు ఎక్కడికక్కడే కనిపిస్తు న్నాయి. వాస్తవానికి ఎప్పటికప్పుడు ఆస్పత్రులను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీ చేయాలి. ఈ విషయంలో స్థానిక సంస్థలు సైతం బాధ్యతగా పనిచేయాలి. కానీ జిల్లాలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బయోమెడికల్ వ్యర్థాల నియంత్రణపై దృష్టి సారించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

స్పష్టమైన ఆదేశాలు



జిల్లాలో ఆస్ప త్రుల నిర్వహణకు సంబంధించి యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబం ధించి నిబంధనలు పాటించాల్సిందే. లేదంటే చర్యలు తప్పవు. ఈ విషయంలో కాలుష్య నియంత్రణ అధికారులు సైతం దృష్టిపెట్టాలి.

– డా.కల్యాణబాబు, డీసీహెచ్ఎస్, శ్రీకాకుళం

ముఖద్వారం నిర్మాణానికి భూమిపూజ

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గుణుపల్లి గ్రామ ముఖ ద్వారం నిర్మాణానికి ఆ గ్రామస్థులు శుక్రవారం భూమి పూజ చేశారు. దీనిని నిర్మించేందుకు గ్రామానికి చెందిన జోగి కృష్ణారావు, జోగి జయ, లక్ష్మి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

అనుభూతినిచ్చిన ఎస్‌సీఎస్‌ఎల్ సదస్సు: రవికుమార్



ఎన్‌సీఎస్‌ఎల్ చైర్మన్ రాహుల్ కరాడ్ నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యూఎస్ఏ బోస్టన్ నగరంలో నిర్వహించిన ఎన్‌సీఎస్‌ఎల్ సదస్సు ఎంతో అనుభూతినిచ్చిందని ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. బోస్టన్ నగరంలో జరిగిన ప్రతిష్ఠాత్మక 50వ ఎన్‌సీఎస్ఎల్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ తరఫున ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొన్నారు. శుక్రవారం బోస్టన్ స్టేట్ పార్లమెంట్ హౌస్ వద్ద ఇతర దేశాలకు చెందిన ప్రజా ప్రతినిధులతో ఈ సదస్సు ముగింపు నిర్వహించారు. ఈ మేరకు సనద్సు ప్రెసిడెంట్ రాహుల్ కరాడ్ ఎమ్మెల్యే రవికుమార్‌కు ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, కొత్త విషయాలు నేర్చుకున్నానన్నారు. మూడు రోజులు నిర్వహించిన ఈ సదస్సు తన రాజకీయ జీవితంలో మరిచి పోలేని అనుభూతిగా మిగులుతుందన్నారు.

రైతులందరికీ ఎరువుల పంపిణీ: జేసీ



మన్నయ్యపేట ఎరువుల గోడౌన్‌లో తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఆమదాలవలస, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులు ఉన్నా యని, సకాలంలో వారికి అందిస్తామని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎరువుల గొడౌన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్ కమిటీ యార్డు కె.మన్నయ్యపేట వద్ద ఉన్న ఎరువుల గొడౌన్లను తనిఖీ చేసి ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలోని అన్ని మండలాలకు ఎరువులను సరఫరా చేయడం జరిగిందని, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఎరువులు పక్కదారి పడుతున్నట్టు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి ప్రకటనలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఏవో మెట్ట మోహన్‌రావు, తహసీల్దార్ ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 5కే రన్

ఇచ్ఛాపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రోటరీ యువజన మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు 5కే రన్ పోటీ నిర్వహించారు. బస్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న బాలుర ఉన్నత పాఠశాల నుంచి లొద్దపుట్టి ధనరాజ తులసమ్మ గుడి వరకు, తిరిగి బస్టాండ్ జంక్షన్ వరకు పరుగు పందెం పోటీ నిర్వహించారు. 100మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందించనున్నామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మోహన్ వెంకటేష్, రామకోటి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు డాక్టర్ దక్కత త్రినాథరెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, కె.రామారావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెం పోటీని ప్రారంభిస్తున్న డాక్టర్ త్రినాథరెడ్డి

ఎమ్మెల్యే దృష్టికి రైతుల సమస్యలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ ద్వారా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని రైతుకుల సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ జన్నెల ప్రసాద్ తెలిపారు. శుక్రవారం బెల్లుపడరోడ్డు ఎల్లమ్మ గుడి వద్ద రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు ఆశి చిరం జీవులు రెడ్డి, దుర్గాశి పాపారావు, కూర్మారావు, సీహెచ్ లోహిదాస్, దక్కత విశ్వనాథం, రఘునాథ్, ప్రకాష్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

18 నుంచి జ్ఞాన ప్రవచన యజ్ఞం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళా మందిరంలో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు ఉపనిషత్తులు, మహాభారతం ప్రవచన యజ్ఞం నిర్వహిస్తున్నట్లు చిన్మయ మిషన్ నిర్వాహకులు, స్వామి పరాత్మానంద సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఢిల్లీ చిన్మయ మిషన్ నిర్వాహకులు, స్వామి చిద్రూపానంద సర స్వతిచే ఉదయం ఉపనిషత్తు, సాయంత్రం మహా భారతం ప్రవచనాలుంటాయన్నారు. 18న సాయంత్రం ఐదున్నర గంటలకు శోభాయాత్ర స్థానిక ఏడు రోడ్ల కూడలి నుంచి బాపూజీ కళామందిర్ వరకు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

అనధికార లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణ

ఆమదాలవలస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో అనధికార లేఅవుట్లలో ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని కమిషనర్ తమ్మినేని రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ 30లోగా రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లలో ప్లాట్లు అక్టోబరు 24లోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ ప్రక్రియ గత నెల 26న ప్రారంభమైందన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

కవిటి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): లండారిపుట్టుగ పంచాయతీ పొందూరుపుట్టుగలో శుక్రవారం తాగునీటి బోరును ఎమ్మెల్సీ ఎన్.రామారావు ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని మండల పరిషత్ నిధులతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పూజలు చేసి ఇంటికి వస్తూ..

● సాధుమెట్ట వద్ద మహిళ మృతి


సీతమ్మ (ఫైల్)

సోంపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జింకిభద్ర గ్రామానికి చెందిన కూన సీతమ్మ (58) శుక్రవారం ఉదయం బెంకిలి సాధు మెట్ట వద్ద మృతిచెందింది. పోలీసులు, కుటుంబసభ్యుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతమ్మ రోజులాగే శుక్రవారం ఉదయం కూడా సాధుమెట్ట వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి ఇంటికి తిరిగుపయణమైంది. ఇదే సమయంలో పక్కనే ఉన్న పూలను సేకరిస్తూ గట్టిగా కేకలు వేస్తూ కుప్పకూలిపోయింది. సమీపంలో యోగా చేస్తున్న పలువురు స్పందించి 108 వాహనానికి ఫోన్ చేశారు. అక్కడి చేరుకున్న 108 సిబ్బంది పరిశీలించగా ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. ఇదిలావుంటే సీతమ్మ మృతిపై పలు అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పూలు కోసే సమయంలో పక్కనే విద్యుత్ లైట్లకోసం ఏర్పాటు చేసి వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై ఉంటుందని కొందరు, గుండెపోటుతో మృతి చెంది ఉండొచ్చని మరికొందరు చెబుతున్నారు. ఎస్‌ఐ వి.లవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుల మధ్య సెల్‌ఫోన్ చిచ్చు

● గొడవ.. పరస్పరం దాడులు.. ఒకరి పరిస్థితి విషమం

సరుబుజ్జిలి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బప్పడాం గ్రామంలో గురువారం రాత్రి సెల్‌ఫోన్ కోసం ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన కొట్లాటలో ఒకరి పరిస్థితి విషమంగా మారింది. కత్తిపోట్లతో తీవ్రంగా గాయపడిన యువకుడు ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఇతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమవతి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. నందికొండ గ్రామానికి చెందిన పల్లి వీరవెంకట దుర్గాప్రసాద్ బప్పడాం గ్రామానికి చెందిన పేడాడ శ్రీధర్ మంచి స్నేహితులు. ఇటీవల దుర్గాప్రసాద్ సెల్‌ఫోన్‌ను శ్రీధర్ తీసుకున్నారు. అతడి వద్ద ఉన్నఫోన్ తిరిగి ఇవ్వాలని దుర్గాప్రసాద్ అడగడంతో.. అమృత లింగానగరం వద్ద ఉన్న పాలకేంద్రం వద్దకు రావాలని శ్రీధర్ ఫోన్‌లో చెప్పాడు. గురువారం రాత్రి దుర్గాప్రసాద్ మరో వ్యక్తిని తీసుకొని అక్కడికి వెళ్లగా గ్రామంలోని తన ఇంటి వద్దకు రావాలని శ్రీధర్ చెప్పడంతో ముగ్గురూ కలిసి బప్పడాం వెళ్లారు. అక్కడ ఇరువురి మధ్య మాటా మాటా పెరిగి కొట్లాటకు దారి తీసింది. ఈ క్రమంలో దుర్గాప్రసాద్ ముఖం, రెండు చేతులు, ఛాతీపై శ్రీధర్ కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచగా.. పక్కనే ఉన్న పొలంలో పడిపోయాడు. దీంతో శ్రీధర్ అక్కడి నుంచి పరారయ్యాడు. దుర్గాప్రసాద్‌తోపాటు వచ్చిన వ్యక్తి ఈ హఠాత్తు పరిణామమం నుంచి తేరుకుని కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వెంటనేవారు గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆమదాల వలస సీఐ పి.సత్యనారాయణ, ఎస్‌ఐ బి.హైమావతి గ్రామానికి చేరుకుని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్‌ను 108లో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించగా.. మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ మేరకు శ్రీధర్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి అతడి కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

పొందూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బురిడికంచరాం గ్రామ సమీపంలో శుక్రవారం గ్రామానికి చెందిన యారబాటి సూరప్పమ్మ మెడలో ఉన్న మూడు తులాల బంగారం పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకుని పారిపోయారు. మధ్యాహ్నం పొలం పనులు ముగించుకుని గెడ్డ దారిలో ధనలక్ష్మి అమ్మవారి ఆలయానికి వస్తుండగా వెనుక నుంచిన వ్యక్తులు కంటిలో కారంకొట్టి పుస్తెలతాడును తెంపుకుని పోయినట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు


ఫాగింగ్ చేస్తున్న దృశ్యం

టెక్కలి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీలో దోమలు నివారణకు గాను పంచాయతీ కార్యదర్శి ఏవీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం దోమల నివారణ ప్రక్రియ చేపట్టారు. కచేరివీధి, చిన్నబజారు, గొల్లవీధి, మెట్టవీధి, నెల్లూరువీధి ప్రాంతాల్లో ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పాతజాతీయ రహదారిపై సెంటర్ డివైడర్‌పై పిచ్చిమొక్కలు, కొమ్మలు సిబ్బందిచే తొలగించారు. మెయిన్‌రోడ్డులో విద్యుత్‌శాఖ సిబ్బంది తొలగించిన చెట్లకొమ్మలను సైతం డంపింగ్ యార్డుకు తరలించారు.

మేజర్ పంచాయతీలో అంతర్గత రోడ్ల నిర్మాణం


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నరసన్నపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్టు ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు అన్నారు. శుక్రవారం మఠంవీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. నరసన్నపేట పట్టణంలో సుమారు రూ.80 లక్షలు ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఈవో ద్రాక్షాయిణి, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వండి


వినతిపత్రం అందిస్తున్న రజక కార్పొరేషన్ డైరెక్టర్

పలాస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన రజక కార్పొరేషన్‌కు నిధులు ఇచ్చి ఆదుకోవాలని ఆ కార్పొరేషన్ డైరెక్టర్ వి.దుర్గారావు కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణను శుక్రవారం వెలగపూడిలో కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ఆదరణ పథకం, యువతకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణాలు, దోబీఘాట్‌లు మంజూరు చేయాలని, రజకులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

జలుమూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు కరవంజ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఈ విద్యార్థులకు క్రీడలు, క్విజ్ పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నామన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహానుబావుల చరిత్రను విద్యార్థులకు వివరిస్తామన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

సామర్థ్యం పెరిగేనా?

● కొరసవాడ ఎత్తిపోతల పథకం విస్తరణకు ఎదురుచూపులు

● సీతారాంపల్లి, బోరుభద్ర గ్రామాలను వెంటాడుతున్న సాగునీటి సమస్య

● దశాబ్దాలుగా హామీలకే పరిమితమవుతున్న పాలకులు


సీతారాంపల్లి గ్రామ చేరువ వరకూ ఉన్న పైపులు



కొరసవాడ ఎత్తిపోతల పథకం

పాతపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కొరసవాడ వద్ద గల ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని పెంచి తమగ్రామానికి సాగునీరు ఇవ్వాలని సీతారాంపల్లి గ్రామ రైతులు కోరుతున్నారు. కొరసవాడ గ్రామ ప్రధాన రహదారిని ఆనుకొని మహేంద్రతనయ నదీ తీరాన రూ.5కోట్ల వ్యయంతో ఈ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా కొరసవాడ, కాగువాడ గ్రామాల పరిధిలోని సుమారు 510 ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అనంతర కాలంలో దీని విస్తరణకు అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో సమీపంలోని సీతారాంపల్లి, బోరుభద్ర తదితర గ్రామాల ఆయకట్టుకి సాగునీరు అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన ఓడిపోవడం, ఆయన ఈ నియోజకవర్గానికి దూరమయ్యారు. అనంతరం ఎమ్మెల్యేగా కలమట వెంకట రమణమూర్తి ఈ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఇప్పటికి సుమారు దశాబ్ద కాలం అయింది కాని దీని సామర్థ్యం పెరగలేదు. ఆ తర్వాత దీని గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ఆయా గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తరచూ సాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకోవాలని పదేపదే ప్రస్తావిస్తుండడంతో మళ్లీ ఆయా గ్రామాల రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వేసవి వస్తేచాలు కనీసం తాగునీటికి కూడా ఆయా గ్రామస్థులు ఇబ్బంది పడుతుంటారు. గ్రామాల చుటూ చెరువులున్నా నీటినిల్వలు అంతంత మాత్రమే. ఈ నేపథ్యంలో కొరసవాడ ఎత్తిపోతల పథకం సేవలు విస్తరిస్తే సాగునీటితోపాటు భూగర్భ జలాలు పెరుగుతాయని వారంత ఆశపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కొరసవాడ ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంచాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం



దశాబ్దాలుగా సాగునీటికై ఎదురుచూస్తున్నాం. ఎత్తిపోతల పథకం సంబంధించి ఇప్పటికే గ్రామ చేరువలో రాజుల బంజేరు భూములవరకూ పైపులైన్లు ఉన్నాయి. కేవలం మూడు నుంచి నాలుగు వందల మీటర్ల వరకూ పైపులైన్లు వేస్తే సీతారాంపల్లి గ్రామానికి సాగునీరు అందుతుంది. ఏటా కనీసం రెండు, మూడు పంటలు పండించుకోవడంతోపాటు తాగునీటి సమస్య తీరుతుంది.

- కుమార్ రెడ్డి, సర్పంచ్, సీతారాంపల్లి

శాశ్వత పరిష్కారం చూపాలి

ఈ పథకం సామర్థ్యాన్ని పెంచితే ప్రధానంగా మా గ్రామానికి సాగునీటితోపాటు తాగునీటికి శాశ్వత పరిష్కారం దొరుకుతుంది. పాలకులు దృష్టిసారించి చొరవచూపాలి. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- మక్క రామారావు, రైతు, సీతారాంపల్లి

11 నుంచి సీజీఆర్‌ఎఫ్ క్యాంపు కోర్టులు

● విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అవకాశం

● సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ


సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

సీతమ్మధార, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, అనకాపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, వెస్ట్ గోదావరి, ఏఎస్‌ఆర్ పాడేరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 11 నుంచి క్యాంపు కోర్టులు నిర్వహించనున్నట్టు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ఛైర్‌పర్సన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11న పలాస డివిజన్ కాశీబుగ్గ సెక్షన్, 13న నర్సీపట్నం డివిజన్ కోటవురట్ల సెక్షన్, 21న అమలాపురం డివిజన్ మలికిపురం సెక్షన్, 22న భీమవరం డివిజన్ ఉండి సెక్షన్, 29న రంపచోడవరం డివిజన్‌లో రాజవొమ్మంగి సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ జరిగే క్యాంపు కోర్టులో వినియోగదారుల తమ ఫిర్యాదులను నేరుగా సీజీఆర్‌ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అలాగే విశాఖపట్నం సీతమ్మధారలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్‌ఎఫ్ కార్యాలయానికి కూడా నేరుగా లేదా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వినియోగదారుల నుంచి వచ్చిన కేసుల వివరాలను పరిశీలించి, విచారణ నిర్వహించి తగిన న్యాయం చేస్తామన్నారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1012ను సంప్రదించవచ్చని సూచించారు. ఈ సదస్సులో ఛైర్ పర్సన్ బి.సత్యనారాయణ, సీజీఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరాలయ పాలక మండలి ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

జలుమూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయ పాలక మండలి నియామకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు దేవదాయ ధర్మాదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఆయన తెలిపారు. ఆసక్తిగల వారు 20 రోజుల్లోగా శ్రీకాకుళం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు దరఖాస్తులు అందించాలని కోరారు.

అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయండి

● ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వేదికగా శనివారం నిర్వహించున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుక నిర్వాహణకు అధికారులు చేపట్టిన ఏర్పాట్లను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహణకై ఎవరికీ ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. గిరిజన సంస్కృతి సంప్రదాయల ప్రదర్శనా వేదికగా నిలిచే ఈ కార్యక్రమాన్ని పండగ వాతావరణం కల్పించాలన్నారు. ఈయన వెంట తహసీల్దార్ నందిగామ ప్రసాదరావు, ఐటీడీఏ అధికారులు, గిరిజన సంఘ నాయకులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఎల్‌ఎన్ పేటను శ్రీకాకుళం డివిజన్‌లోకి మార్చండి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఎల్‌ఎన్ పేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఎన్ పేట మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్ నుంచి శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లోకి మార్చాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. డొంకలబడవంజ గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, కారదర్శులు ఎం.మనోహర్‌నాయుడు, కె.చిరంజీవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌ఎన్ పేట మండలం గతంలో శ్రీకాకుళం డివిజన్‌లో ఉన్నప్పుడు మండల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం ఉండేది కాదని, గత ప్రభుత్వ అనాలోచిత కారణంగా టెక్కలి డివిజన్‌లోకి వెళ్లిపోయిందని, దీంతో మండల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. టెక్కలి వెళ్లేందుకు ఎలాంటి బస్సులు, వాహన సౌకర్యం లేకపోవడంతో నానా యాతన పడాల్సి వస్తుందన్నారు. అదే శ్రీకాకుళం వెళ్లేందుకు ఎంతో అనువగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మామిడి. గోవిందరావు చొరవ తీసుకొని మండల ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు వి.ఆనందరావు, ఎస్.కిషోర్‌కుమారు, ఎస్.తేజేశ్వరరావు, టి.అప్పన్న, కె.కృష్ణమాచారి, జె.మోహనరావు, పి.వెంకటరావు, పి.తవిటయ్య తదితరులు ఉన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు జె.రామారావు హెచ్చరించారు. చల్లవానిపేట కూడలి, చిన్నదూగాం కూడలిలో గల ఎరువుల షాపులను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన ధరకంటే వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇదే రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల వివరాలు, వాటి ధరలను నోటీస్ బోర్డులో ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో రెవిన్యూ పరిశీలకులు కిరణ్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి/ జలుమూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.26,218 చెక్కును శుక్రవారం మబగాం కత్తెరవానిపేట క్యాంప్ కార్యాలయంలో జలుమూరు మండలం రావిపాడు గ్రామానికి చెందిన కింజరాపు సింహాచలంకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం వంటిదన్నారు. రావిపాడు గ్రామానికి చెందిన సింహాచలం అనారోగ్యంతో బాధపడుతున్నాడని వైద్య ఖర్చులు అందించాలని ఎమ్మెల్యేకు వినతిద్వారా విజ్ఞప్తి చేశారు. సీఎం సహాయనిధికి నివేదించగా డబ్బులు మంజూరయ్యాయన్నారు. ఆయన వెంట గ్రామపెద్దలు, కూటమి నాయకులు ఉన్నారు.

వారాహి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

జలుమూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో కొలువు తీరిన వారాహి అమ్మవారి సన్నిధిలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో శ్రీముఖలింగంతో పాటు కరకవలస, మెట్టపేట, నగిరికటకం, బైరాగిపేట తదితర పరిసర గ్రామాలకు చెందిన మహిళలు పూజలు చేసి అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చల్లవానిపేట సంతోషిమాత ఆలయంలో అర్చకులు మావుడూరు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

రౌడీయిజం చేస్తే ఊరుకునే ప్రభుత్వం కాదు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

కొత్తూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రౌడీయిజం చేస్తామంటే కూటమి ప్రభుత్వం ఎవరి వదలిపెట్టదన్న విషయం వైసీపీ నాయకులు గుర్తెరిగి మెలగాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం కొత్తూరు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. తిరుపతిలో భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి కార్యాలయంలో వైసీపీ రౌడీలు ఒక దళిత యువకుడిని బంధించి చిదకబాది చిత్రహింసలకు గురిచేయడమే కాకుండా విడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి భయపెట్టడం దారుణమన్నారు. కల్లెమ్మ సర్పంచ్ ఎల్.భగవాన్‌దాస్ నాయుడు, టీడీపీ నాయకులు చోడవరపు జోగినాయుడు, ఎద్దు శ్రీనివాసరావు, మడపాన రాజారావు, గండికోట త్రినాథరావు, మడపాన రాజారావు పాల్గొన్నారు.

గొర్రిబందలో సంతోషిమాత శోభాయాత్ర


కలశాలతో శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

జలుమూరు (సారవకోట), ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గొర్రిబంద గ్రామంలో కొలువు తీరిన సంతోషిమాత శోభాయాత్ర శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రావణమాస శుక్రవారం పర్వదినం పురస్కరించుకొని వరలక్ష్మీదేవి వ్రతం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం వరలక్ష్మీదేవి సామూహిక వ్రతాలు అర్చకులు సారవకోట సోమేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక పల్లకిలో ఆసీనులను చేసి సారవకోట, గొర్రిబంద గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే చీడిపూడిలో కొలువు తీరిన వేంకటేశ్వరాలయంలో వరలక్ష్మీదేవి వ్రతం పురస్కరించుకొని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చీడిపూడితో పాటు బుడితి, అవలింగి గ్రామస్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

మందస, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం మందసలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు సవర జగన్నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఆదివాసీ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

మెరుగైన విద్యను అందించండి


సూచనలిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

పలాస రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు సాంకేతిక విద్యను అందించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సత్యసాయి విద్యావిహార్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు అన్నారు. స్థానిక సత్యసాయి విద్యావిహార్ పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఐఐటీ, ఎన్ఐటీ ఫౌండేషన్ కోర్సులపై ఇంకా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మానవతా విలువలతో కూడిన క్రమశిక్షణ కలిగిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, సేవాదళ్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

12న సీపీఐ నేత నారాయణ రాక

హరిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కార్గో ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామాల్లో ఈనెల 12వ తేదీ మంగళవారం సీపీఐ జాతీయ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు నారాయణ పర్యటించనున్నట్టు ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మందస మండల పరిధిలోని రాంపురం నుంచి బేతాళపురం, గంగువాడ, బిడిమి తదితర గ్రామాలతోపాటు వజ్రపుకొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకారులు, ప్రజా సంఘాల నాయకులు, బాధిత గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బీజేపీతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యం

ఎల్‌ఎన్ పేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో శుక్రవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లలో దేశం ఆర్థికంగా ఎంతో ప్రగతి సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో కలిసి పనిచేస్తుండడం వల్ల రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సూర్యనారాయణ, నాయకులు ఎం.రవికుమార్, జి.సోమేశ్వరరావు, వి.వెంకటరమణ, ఆర్.డిల్లీశ్వరరావు, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాతపట్నం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కె.గోపాలపురం, దశరధపురం, తిడ్డిమి, రంకిణి, చంగుడి, సూర్యనారాయణపురం సరాళి గ్రామాల పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు టెక్కలి విద్యుత్ ఈఈ ఇ.నరసింహకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్‌డీఎస్‌ఎస్ ప్రాజెక్ట్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ విద్యుత్ అంతరాయాలు ఏర్పడనుందన్నారు ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

వికాస్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బదిలీ

పోలాకి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పోలాకి వికాస్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎం.కోటేశ్వరరావుకు బదిలీ అయింది. గత మూడేళ్లగా పోలాకి గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా సేవలందించిన ఆయనకు ఆకస్మికంగా బదిలీ చేయడంతోపాటు వెంటనే రిలీవ్‌చేయడం గమనార్హం. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం బ్యాంక్ సిబ్బంది ఆఘమేఘాలమీద మేనేజర్ బదిలీ ప్రక్రియ వీడ్కోలు కార్యక్రమం చేపట్టారు. బ్యాంక్, వెలుగు సిబ్బంది మేనేజర్‌కు శాలువతో సత్కరించి ఆయన సేవలను స్థానికులు కొనియాడారు. కార్యక్రమంలో ఫీల్డ్ మేనేజర్ క్యాషియర్, సహాయకులు అనిల్, జవ్వాది తిరుమల, వెలుగు, సమీప బ్యాంక్ సిబ్బంది, ప్రచారకులు రోణంకి కసవయ్య, పాల్గొన్నారు.

మురుగునీటితో ఇబ్బంది


కేపీ వలసలో నిల్వ ఉన్న మురుగునీరు

పోలాకి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వర్షంనీరు, వాడుక నీరు బయటకు వెళ్లనీయకుండా ప్రజలు వీధిలో నిల్వ చేస్తున్నారని, దీంతో అంటురోగాలు ప్రబలుతున్నాయని కుసుమ పోలవలస గ్రామానికి చెందిన యువజన నాయకులు తర్ర లక్ష్మీనారాయణ, బి.రాంబాబు, రామారావు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. వీధి ప్రజలకు ఎన్నిసార్లు చెప్పినా విన్పించుకోవడంలేదని సంబందిత అధికారులు మురుగునీరు దూరప్రాంతాలకు వెళ్లే విధంగా డ్రైనేజీ చూపాలని వారు సూచించారు. మూడు ప్రాంతాల్లో మురుగునీరు దుర్గంధ భరితంగా నిల్వఉందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. సచివాలయ సిబ్బంది పంచాయతీ అధికారులు స్పందించాలని వారు కోరారు. వారంరోజుల్లోగా మురుగునీరు తొలగించాలని లేకుంటే ఆందోళన చేపడతామన్నారు.